

**కల నెరవేరుతున్న వేళ..**
అయోధ్యలో రామ మందిరం నిర్మించాలన్న ఐదు శతాబ్దాల కల నెరవేరుతుండడంతో భక్తజనంలో ఆనందం వ్యక్తమవుతోంది.
- 8లో ▸



**చట్టాన్ని అతిక్రమించవద్దు..**
చట్టాన్ని ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.6 /21.1

**వాతావరణం**
ఆకాశం ఉదయం మేఘావృతమై ఉండవచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### పెట్టుబడి డబ్బులివ్వకుంటే ఆందోళన చేస్తా



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని సిద్ధుల గుట్ట ఘాట్ రోడ్డు నిర్మాణంలో తాను పెట్టుబడి పెట్టిన డబ్బులను ఆలయ కమిటీ ఇప్పించాలని లేకపోతే ఆందోళన చేపడ్తానని ఎన్‌ఆర్‌ఐ సనుగుల బాబు తెలిపారు. ఇటీవలే అమెరికా నుంచి వచ్చిన బాబు శనివారం ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఘాట్ నిర్మాణం విషయంలో సనుగుల బాబు గతంలో ఆలయ కమిటీతో ఒప్పందం కుదుర్చుకుని రూ. 3.85 కోట్ల నగదు చెల్లించారు. ఒప్పందం ప్రకారం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 8 కోట్ల నిధుల నుంచి దామాషా ప్రకారం ఆలయ కమిటీ సభ్యులు సనుగుల బాబు పంచుకోవాల్సి ఉంది. కాగా నిధులను దారి మళ్లించి తనకు అన్యాయం చేశారని బాబు ఆరోపిస్తున్నారు. ఒప్పందం ప్రకారం తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని లేకపోతే ఆందోళన చేస్తానని స్పష్టం చేశారు.

### భక్తుల 'బడా' దోపిడీ

- బడాపహాడ్‌కు రూ. కోట్ల ఆదాయం వస్తున్నా అభివృద్ధి శూన్యం



వర్ని : పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా తయారైంది బడాపహాడ్ దర్గా పరిస్థితి. బడా పహాడ్‌కు ప్రతి ఏడాది కాంట్రాక్ట్ ద్వారా రూ. 3.60 కోట్ల ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో వక్ఫ్‌బోర్డు పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చే బడాబహాడ్‌కు వస్తున్నా కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు, పరిశుభ్రత మచ్చుకైనా కానరావు. దర్గా వద్ద భక్తులు సమర్పించే నైవేద్యానికి రూ. 500 నుంచి రూ. 5 వేల వరకు పూజారులు బలవంతంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వనిదే నైవేద్యం కూడా సమర్పించనివ్వని పరిస్థితి ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు.

**ఉర్సు ఏర్పాట్ల పరిశీలన**

వర్ని : ఈనెల 22న బడా పహాడ్ ఉర్సు సందర్భంగా ఏర్పాట్లను శనివారం బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఉర్సుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వక్ఫ్‌బోర్డు అధికారులకు సూచించారు. బస్ సౌకర్యం, వైద్యశిబిరం, భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, బడా పహాడ్ డిప్యూటీ సూపర్వైజర్ జమాల్, నాయకులు వెంకట్ గౌడ్, ఎస్సై కష్ణ కుమార్ ఉన్నారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నిజామాబాద్ రూరల్(జక్రాన్‌పల్లి): చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ, నిజామాబాద్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'న్యాయ చైత న్య సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్జి నసీం సుల్తానా పాల్గొని, మాట్లాడారు. చట్టాన్ని ఎవరు కూడా చేతిలోకి తీసుకోకూడదని, చట్టం దృష్టిలో అందరూ సమానమే అని వివరించారు. మండలంలో రైతులు నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు లేక ఇబ్బందులకు గురి అవుతున్నారని దీనితో పట్టా భూముల లేక మరే ఇతర వాటిలో సమస్య ఉంటే దానికి పోలీస్ శాఖ, జ్యుడీషియల్ కోర్టు, రెవెన్యూ శాఖలను సంప్రదించాలని సూచించారు. గ్రామాలలో గ్రామ బహిష్కరణ, అంటరానితనం అనేది ఉండకూడదని తెలిపారు. అలాగే పలు అంశాలపై అవగాహన కల్పించారు. అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ విజయ సారథి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, ఆర్మూర్ బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, ఎంపీపీ కుంచాల విమల రాజు, పోలీస్ అధికారులు సైదా, తిరుపతి, ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంపీవో యూసఫ్ ఖాన్, ఎంఈవో శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# అయోధ్య రామయ్యకు జేజేలు

- అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ వేళ వాడవాడలా భక్తిభావం
- నెలరోజులుగా ఇంటింటికీ అక్షింతల పంపిణీ
- రేపు ఇంటింటా 'దీపావళి' చేసుకునేందుకు సిద్ధమవుతున్న ప్రజలు
- జిల్లాలో ఆలయాల శుద్ధి

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 'శ్రీ రామ జయరామ జయజయ రామ'.. ఈ తారకమంత్రమే ప్రస్తుతం వాడవాడలా మారుమోగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల ఆరాధ్య దైవం, ఆదర్శనీయుడు శ్రీరామచంద్రుడు. 500 సంవత్సరాలుగా ప్రతి ఒక్కరూ కలగంటున్న అయోధ్య శ్రీరామజన్మభూమిలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సోమవారం చేయనున్నారు. శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న ఈ క్రతువులో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాధుసంతులు, భక్తులు భారీగా పాల్గొననున్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వాడవాడలా, ఇంటింటా ఆ అద్భుత క్షణాల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లాలో గత నెల 23 నుంచి అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మొదటగా అక్షింతలను ఇందూరు జిల్లా కేంద్రానికి తీసుకొచ్చినప్పుడు బోర్గం వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పులాంగ్, గోల్‌హనుమాన్, పెద్దబజార్, గాజుల్‌పేట్ మీదుగా పెద్ద రామమందిర్ వరకు భారీ ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఈ ప్రదర్శనలో సాధుసంతు లు సైతం పాల్గొన్నా రు. మరోవైపు శ్రీరాముడి పాదుకలను జిల్లాలోని అనేక చోట్ల ఊరేగించడంతో పాటు భక్తిప్రపత్తులతో పూజలు చేశారు.

ఐదు వందల ఏళ్లుగా ప్రతి హిందువు కలగన్న శ్రీ రామజన్మభూమి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఊరూవాడా శ్రీరామ తారకమంత్రం జపిస్తోంది. జిల్లాలో గత నెల 23 నుంచి ప్రారంభమైన అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ ఇంటింటికీ పూర్తయింది. శ్రీరాముడి పాదుకలను ఊరేగించి భక్తితో పూజలు చేశారు. జిల్లాలోని ఖిల్లా రఘునాథ రామాలయం, పెద్ద రామమందిర్, డిచ్‌పల్లి రామాలయం తదితర ఆలయాలను అలంకరించారు. అన్ని ఆలయాలను శుద్ధి చేశారు. జిల్లాకు చెందిన శ్రీనివాసశాస్త్రి తయారు చేసిన 5 వెండి ఇటుకలనే బాలరాముడి మందిర నిర్మాణ శంకుస్థాపనకు ఉపయోగించడం విశేషం.





ఖిల్లా రామాలయాన్ని శుద్ధి చేస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్(ఫైల్)

■ జిల్లాలోని అన్ని రామాలయాల్లో శుద్ధి కార్యక్రమాలు చేశారు. ఆలయాల శుద్ధి కార్యక్రమాల్లో ఎంపీ ధర్మపురి అర్వింద్, శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ రాష్ట్ర కోకన్వీనర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.



బోర్గాం నుంచి అయోధ్య అక్షింతలను ర్యాలీగా తీసుకొని వస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్



ఎంపీ అర్వింద్‌కు అక్షింతలు అందజేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ నాయకులు

### వెండి ఇటుకల తయారీ ఘనత జిల్లా వాసిదే..



గత నాలుగేళ్లుగా అయోధ్య లో ఉంటూ రాముడి సేవ చేస్తు న్న జిల్లాలోని మాక్లూర్ మండ లం కొత్తపల్లికి చెందిన శ్రీనివాసశాస్త్రి తయారు చేసిన 5 వెండి ఇటుకలనే ప్రధానమంత్రి మోదీ బాలరాముడి భవ్య మందిర నిర్మాణ శంకుస్థాపనకు ఉపయోగించడం విశేషం. ఈ ఇటుకల ను శ్రీనివాస శాస్త్రి అయో ధ్య రాజకుటుంబీకుల చేతులమీదుగా అయో ధ్య కలెక్టర్‌కు అందజేయడం గమనార్హం. ఈ ఇటుకలతో పాటు శ్రీనివాస శాస్త్రి రాముడి బంగారు, వెండి పాదుకలు తయారు చేశారు. ఈ పాదుకలకు దేశంలోని పీఠాధిపతులందరూ పూజలు చేశారు.

కాగా జిల్లాకు చెందిన ఇద్దరు భక్తులు అయోధ్య వరకు సైకిల్ యాత్రగా వెళ్లారు.



నగరంలో అక్షింతలను అందజేస్తున్న హిందూవాహిని నాయకుడు ధాత్రిక రమేశ్



పెద్దరామమందిర్‌లో పూజారికి అయోధ్య అక్షింతలు అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



అయోధ్య అక్షింతలను తీసుకొస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు

### 500 ఏళ్ల కల సాకారమవుతోన్న శుభదినం..

శ్రీరాముడు జన్మించిన అయోధ్యలో 500 ఏళ్ల పోరాటం తరువాత రామమందిరం నిర్మాణంతో ప్రతి ఒక్కరి కల నెరవేరుతోంది. బాలరాముడి ప్రాణప్రతిష్ఠను వీక్షించే అవకాశం దక్కిన మనమందరం ధన్యులం. ప్రాణప్రతిష్ఠ సమయంలో ప్రతిఒక్కరూ 'శ్రీరామ జయరామ జయజయ రామ' అనే తారక మంత్రాన్ని 108 సార్లు జపించుకోవాలి.

– ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ రాష్ట్ర కోకన్వీనర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే

### ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలి

500 ఏళ్ల పోరాటం తరువాత రామజన్మభూమిలో ఆలయం నిర్మాణమై బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అవుతున్నందున ప్రతి ఇంట్లో ప్రతి వందేళ్లకు ఒక దీపం చొప్పున సూర్యాస్తమయం తర్వాత 5 దీపాలు వెలిగించాలి. పూజామందిరంలో 2 దీపాలు, గడప వద్ద 2 దీపాలు, తులసి కోట వద్ద ఒక దీపం వెలిగించాలి. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అయిన వెంటనే అక్షింతలకు పూజ చేసి కుటుంబ సభ్యులందరూ నెత్తిన చల్లుకోవాలి. ముందుగా ఉదయమే సమీపంలోని ఆలయానికి వెళ్లి దైవదర్శనం చేసుకోవాలి.

– ధాత్రిక రమేష్, వీహెచ్‌పీ జిల్లా సహకార్యదర్శి

### ప్రధాని పిలుపు మేరకు దీపావళి జరుపుకోవాలి



రాముడు పుట్టిన రామజన్మభూమిలో శతాబ్దాల పోరాటం తర్వాత భవ్య మందిర నిర్మాణం ప్రతిఒక్కరికీ శుభకరమే. ఈ శుభసమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి సాయంత్రం దీపావళి జరుపుకోవాలి.

– మంచాల జ్ఞానేందర్ గుప్తా, భక్తుడు

### రామకోటిలో తరిస్తున్న రాజమణి

- ఇప్పటి వరకు పూర్తయిన 75 లక్షల పైచిలుకు రామకోటి



నిజామాబాద్ సిటీ: ఆ వృద్ధురాలు రోజంతా శ్రీరామ నామస్మరణలో లీనమై ఉంటుంది. ఎక్కడ ఉన్న సరే రామకోటి రాయేందే ఆమెకు రోజు గడువదు, రాముడిని తలచుకోనిదే ఏ పనీ చేయదు. రామనామ జపంలోనే తరిస్తుంటుంది. నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన 70 ఏళ్ల వంజరి రాజమణి 20 సంవత్సరాల క్రితం ఓ యజ్ఞ కార్యక్రమానికి హాజరయ్యింది. అక్కడ శ్రీరాముడికి జరుగుతున్న పూజ కార్యక్రమాలకు ఆకర్షితురాలై అప్పటి నుంచి రామకోటి రాయటం మొదలు పెట్టింది. నిత్యం 1,040 సార్లు రామకోటి రాస్తుంది. ఇప్పటి వరకు దాదాపు 75 లక్షల పై చిలుకు రామకోటి రాయటం విశేషం. మరికొన్నేళ్లలో మిగిలిన 25 లక్షల రామకోటి రాస్తానని, అది తన జీవిత లక్ష్యమని అంది. ఈ వయస్సులోనూ కంటి అద్దాలు లేకుండా రామకోటి రాస్తుంది. రామకోటి రాసిన పేపర్లను నెలరోజులకు ఒకసారి భద్రచలం శ్రీరాముడి ఆలయానికి పంపుతుంది. ఈసారి అయోధ్యకు పంపనున్నట్లు వెల్లడించింది. ఆమెను ఆదర్శంగా తీసుకుని చాలామంది రామకోటి రాయటం మొదలుపెట్టారు.

**సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం..**

ఇంట్లో కుటుంబ సభ్యులు గాని, ఇతరులు ఏదైనా సేవ చేస్తున్నారంటే చాలు రాజమణి వారిని భుజం తట్టి ప్రోత్సహిస్తుంది. ఉదయం నుంచి ఎంతో హుషారుగా ఉంటూ తన పనులు తాను చేసుకుంటూ ఎందరో వృద్ధులకు రాజమణి ఆదర్శంగా నిలుస్తుంది.

# డీసీవోపై అవినీతి ఆరోపణలు

- బదిలీ జరిగిన రోజే మంత్రి తుమ్మలకు ఫిర్యాదు
- అధికారిపై విచారణకు ఆదేశం



సింహాచలం

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా సహకార శాఖ అధికారిగా దీర్ఘకాలం గా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన సింహాచలంపై అవినీతి ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఆయనకు బదిలీ జరిగి రెండు రోజులు కూడా గడవకముందే ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లడం జిల్లాలో చర్చనీయంగా మారింది. తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఈనెల 19న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సింహాచలంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి డీసీవో పై విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ప్రస్తుతం బదిలీపై వెళ్లిన సింహాచలంను కమిషనర్ ఆఫీసుకు అటాచ్ చేశారు. జిల్లాకు నూతన డీసీవోగా వచ్చిన శ్రీనివాస్ యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వచ్చారు. వచ్చి రాగానే సహకార శాఖలో అధికారులపై అవినీతి ఆరోపణలు రావడం, మంత్రికి ఫిర్యాదులు వెళ్లడంతో శాఖలోని ఉద్యోగులు, సహకార సంఘాల నాయకుల్లో కొంత భయం నెలకొంది.

**చాలా ఏళ్లుగా జిల్లాలోనే..**

డీసీవో సింహాచలం జిల్లాలో చాలా ఏళ్లుగా పనిచేశారు. ఈ క్రమంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. పలు సొసైటీల్లో జరిగిన అవినీతికి డీసీవో బాధ్యులపై చర్యలు తీసుకోలేదని, వారిని కాపాడే ప్రయత్నం చేశారనే విమర్శలు సైతం ఉన్నాయి. మాక్లూర్, బ్రాహ్మణపల్లి, డిచ్‌పల్లి, తాళ్ల రాంపూర్, హొన్నాజీపేట్ లాంటి సొసైటీలో కోట్ల రూపాయల అవినీతి జరిగిన విషయం తెలిసిందే. ఇటు ధాన్యం కొనుగోళ్లలో కూడా రైతులు పండించిన ధాన్యంలో కడ్తా తీసే విషయంలో కమిషన్లు అందుకున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి. గత ప్రభుత్వంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సింహాచలం పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అందరికీ సన్నిహితంగా ఉండడంతో ఆయనపై చర్యలు తీసుకోవడానికి ఇష్టపడలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సింహాచలంపై వ్యవసాయ శాఖ మంత్రి కి ఆధారాలతో సహా ఫిర్యాదులు అందడంతో ఆయనపై చర్యలు ఉంటాయని అంతా అనుకుంటున్నారు. మంత్రి ఎవరిని విచారణకు ఆదేశిస్తారని దానిపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ విచారణ జరిగితే సహకార శాఖలో అవినీతికి పాల్పడిన మరింత మంది అధికారులతో పాటు సహకార సంఘాల్లో కూడా అక్రమార్కులు బయటపడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా మంత్రికి ఫిర్యాదు చేసిన అన్వేష్ రెడ్డి ఈనెల 23న ప్రజావాణిలో కూడా మరోసారి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నారు.

### పువ్వులిస్తూ.. ట్రాఫిక్ నియమాలు చెబుతూ..

నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులు గులాబీ పువ్వులు ఇస్తూ ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. శనివారం ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్, ఆర్‌ఎస్సైలు వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

– ఖలీల్‌వాడి



వాహనాదారులకు గులాబీ పువ్వు ఇస్తున్న ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్

# సీఐడీ అదుపులో పాస్‌పోర్ట్ ఏజెంట్

- జిల్లాలో మళ్లీ నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టుల కలకలం
- భీమ్‌గల్‌లో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు
- ల్యాప్‌టాప్, బ్యాగ్ స్వాధీనం





ఖలీల్‌వాడి : జిల్లాలో మళ్లీ నకిలీ సర్టిఫికెట్లు పెట్టి పాస్‌పోర్టులు ఇప్పించారనే ఆరోపణతో నగరంలో పాస్‌పోర్ట్ ఏజెంట్‌ను సీఐడీ అధికారులు భీంగల్ అదుపులోకి తీసుకున్న ఘటన కలకలం రేపింది. 2021లో బోధన్ పట్టణంలో ఎస్బీ ఎస్సై మల్లేశ్ ఇంటి చిరునామాతో 70 మంది పాస్‌పోర్టులు తీసుకున్న ఘటన తర్వాత మూడేళ్లకు మళ్లీ నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టులు అందిస్తున్న ఏజెంట్లపై సీబీసీఐడీ అధికారులు దాడులు నిర్వహించి ట్రావెల్స్ ఏజెంట్లను అదుపులోకి తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో పాస్‌పోర్టు కార్యాలయానికి ముందు షాప్ నిర్వహిస్తున్న పాస్‌పోర్టు ఏజెంట్‌ను రెండు రోజులుగా ఐదు బృందాలు రెక్కీ నిర్వహించి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.

**నిజామాబాద్, హైదరాబాద్‌లో..**

నిజామాబాద్, హైదరాబాద్‌కు చెందిన సీబీసీఐడీ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీంట్లో ఐదు బృందాలు ఏర్పాటు చేసి నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టులకు దరఖాస్తు చేసిన ఏజెంట్లపై తనిఖీలు నిర్వహించి వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్, స్టాంప్‌లను అధికారులు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పాస్‌పోర్టు సంబంధించిన ఫిర్యాదులపై సీబీసీఐడీ అధికారులు స్పందించడం లేదు.

**రెక్కీ నిర్వహించి..**

భీంగల్ పట్టణంకు చెందిన సుభాష్ పాస్‌పోర్టు ఏజెంట్‌గా పని చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పాస్‌పోర్టు ఆఫీస్ వద్ద షాపు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ నుంచే పాస్‌పోర్టులకు దరఖాస్తులు చేసి పాస్‌పోర్టు ఆఫీస్‌కు పంపిస్తున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. సుభాష్ అరెస్ట్ విషయం స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ పూర్తివివరాలు తెలియదని వారంటున్నారు. సుభాష్ ఇంట్లోని ల్యాప్‌టాప్, బ్యాగ్‌ను సీబీసీఐడీ అధికారులు తీసుకెళ్లినట్లు తెలిసింది. నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టులు ఇచ్చినట్లు భీంగల్‌లో ప్రచారం జరుగుతుంది. భీంగల్‌లో సుభాష్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత జిల్లా కేంద్రంలో, ట్రావెల్స్ షాపులను శనివారం మధ్యాహ్నం వరకు మూసి ఉంచారు. సుభాష్‌ను సీబీసీఐడీ అధికారులు విచారించిన తర్వాత ఎవరి ద్వారా పాస్‌పోర్టులు తీయడానికి ఒప్పందం చేసుకున్నారనేది బయటకొచ్చే అవకాశాలున్నాయి.

# మొదటిరోజు 1,783 దరఖాస్తులు

- నేడు కొనసాగనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- 22వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం

సుభాష్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా శని, ఆదివారాల్లో జిల్లాలోని 1549 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలను అందుబాటులో ఉండాలని ఆదేశాలిచ్చింది. శనివారం మొదటిరోజు 1,783 దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓల ద్వారా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు డిచ్‌పల్లి, ధర్పల్లి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇప్పటికే ముసాయిదా జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. జనవరి 22వ తేదీవరకూ కొత్త ఓటర్ల నమోదుతోపాటు తొలగింపు, మార్పులు, చేర్పులకు దరఖాస్తుతోపాటు ఆన్‌లైన్‌లోనూ అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి, బీబీపూర్, ధర్పల్లి మండలం రామడుగు పాఠశాలల్లో గల పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఓటర్ల నమోదుకు సంబంధించి రిజిస్టర్లను పరిశీలించారు. 2024 జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండిన వారిని ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలని బీఎల్‌ఓలకు సూచించారు. గ్రామాల్లో ప్రచారం చేశారా అని తహసీల్దార్ రాజేందర్, ఆర్‌ఐ సంతోష్‌ను ప్రశ్నించారు. ప్రతిఒక్క దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు.



సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

## క్లుప్తంగా

### తెయూ తెలుగు విభాగాధిపతిగా లక్ష్మణ్ చక్రవర్తి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి(హెచ్‌వోడీ)గా డాక్టర్ సీహెచ్ లక్ష్మణచక్రవర్తి నియామకమయ్యారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ బి.వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి శనివారం తన చాంబర్‌లో లక్ష్మణ్ చక్రవర్తికి నియామక ఉత్తర్వులు అందజేశారు. హెచ్‌వోడీగా నియామకమైన లక్ష్మణచక్రవర్తికి తెలుగు శాఖ అధ్యాపకులతో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

### 'ఓపెన్' ప్రవేశాల గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు అడ్మిషన్ల గడువును పెంచినట్లు కో ఆర్డినేటర్ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు గడువును పొడగించామని, ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని తమ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే డిగ్రీ తృతీయ, ద్వితీయ, పీజీ ద్వితీయ సంవత్సరానికి రిన్యువల్ చేసుకోవడానికి ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: నగరంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూర్యకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగారంలోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, పాఠశాలలో వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాలలో ఐఐటీ, జేఈఈ, నీట్, లాసెట్ కోచింగ్ అందుబాటులో ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు.

### హాస్టల్ వసతి కల్పించాలి

- ఎన్‌ఎస్‌యూఐ నాయకుల వినతి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సారంగపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్ బీఈడీ విద్యార్థులకు డిచ్‌పల్లిలోని మెయిన్ క్యాంపస్ హాస్టల్‌లో వసతి సౌకర్యం కల్పించాలని తెయూ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్ష, కార్యదర్శులు కొమిరే శ్రీశైలం, బానోత్ సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి సారంగాపూర్ బీఈడీ కళాశాల విద్యార్థులకు మెయిన్ క్యాంపస్‌లోనే హాస్టల్ వసతి కల్పిస్తున్నారని తెలిపారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బీఈడీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అల్లూర్ రాజేందర్ పాల్గొన్నారు.

### 'ఆల్ఫోర్స్'కు అనుమతి లేదు

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

నిజామాబాద్‌అర్బన్ : నిజామాబాద్ నగరంలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఇంతవరకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రఘురాజ్ స్పష్టం చేశారు. పలు విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ విచారణ చేస్తున్నదన్నారు. 2024– 25 విద్యా సంవత్సరానికి ఇంకా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ నుంచి అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభం కాలేదని స్పష్టం చేశారు. ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల పేరుతో జరుగుతున్న ప్రచారంపై విచారణ చేపట్టి బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రామమందిర కల.. నెరవేరుతున్న వేళ..

500 ఏళ్ల అయోధ్య రామ మందిర కల నెరవేరుతోంది. ఆలయ నిర్మాణ కోసం కోట్ల మంది భక్తులు పరితపించారు. ఆ క్షణం మరికొద్ది గంటల్లో ఆవిష్కృతం కాబోతోంది. ఈ నేపథ్యంలో నాడు కరసేవకు వెళ్లిన వారితో పాటు జిల్లా వాసుల మనోగతం..



### ఎంతో సంతోషంగా ఉంది



భిక్కనూరు: అయోధ్యలో మందిర నిర్మాణ కల నేడు నెరవేరడం చాలా సంతోషంగా ఉంది. 1990లో అయోధ్యలో నిర్వహించిన శిలన్యాస్ కార్యక్రమంలో పాల్గొన్నాను. అప్పటి యూ పీ సీఎం ములాయం సింగ్‌యాదవ్ కరసేవకులపై లాఠీచార్జీ, కాల్పులు చేయించాడు. త్రుటి లో తప్పించుకున్నాను.

– మధుసూదన్‌రెడ్డి, కరసేవకుడు, రామేశ్వర్‌పల్లి

### పది బృందాలతో కలిసి..



సదాశివనగర్: మా గ్రామంలో పది మంది బృందాల భక్తులతో కలిసి 1,852 కుటుంబాలకు అక్షింతలను పంపిణీ చేశాం. భక్తి, శ్రద్ధలతో ఇంటింటికి తిరిగి అందజేశాం. ఇందులో గ్రామస్తుల సహకారం ఎంతో ఉంది. ఈ నెల 22న జరిగే ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఉదయం నుంచి భజనలు చేయనున్నాం.

–కొప్పుల నర్సారెడ్డి, సదాశివనగర్

### భవ్య రామమందిర కల నెరవేరబోతోంది



బిచ్కుంద(జుక్కల్): రామ జన్మభూమి ట్రస్టు పిలుపు మేరకు 1990, 1992లో కరసేవకుడిగా అక్కడికి వెళ్లినందుకు చాలా గర్వపడుతున్నా. మండలం నుంచి 20 మంది వెళ్లాం. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న భవ్య రామ మందిరం కల నెరవేరబోతోంది. 22న బిచ్కుంద ఆలయంలో నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్నాం.

– దర్పల్ దశరథ్, కరసేవకుడు, బిచ్కుంద

### అదృష్టంగా భావిస్తున్నా..



మాచారెడ్డి: అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆయన అక్షింతలు పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. శ్రీరామచంద్రుడి గొప్ప గుణాలను అర్థం చేసుకున్న వాళ్లు ధన్యులు. రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించడానికి నా వంతుగా స్థానిక వీరహనుమాన్ వేంకటేశ్వరాలయంలో ఏర్పాట్లు చేయిస్తున్నాను.

– పిట్ల కృష్ణంరాజు, మాచారెడ్డి చౌరస్తా

### సరయూ నది వద్ద కాల్పులు



భిక్కనూరు: అయోధ్యలో 1990లో నిర్వహించిన శిలన్యా స్‌లో పాల్గొన్నాను. కరసేవకులను అడ్డుకున్నా అడవిలో నుంచి పొలాల మీదుగా అయోధ్య సరయూ నది వద్దకు చేరుకున్నాం. అక్కడ పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. చాలామంది కరసేవకులు మృతి చెందారు. కరసేవకుల రక్తం నదిలో ప్రవహించడం చూసి కన్నీళ్లు ఆగలేదు. రామమందిరం నిర్మాణ కల ఇప్పటికి నెరవేరుతోంది.

–రవీందర్‌రెడ్డి, రామేశ్వర్‌పల్లి




### జైశ్రీరాం ఆకృతిలో..



కమ్మర్‌పల్లి: అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో కమ్మర్‌పల్లిలోని మినిమి హైస్కూల్ విద్యార్థులు హిందీ, ఆంగ్లం అక్షరమాలలో జైశ్రీరామ్ ఆకృతిలో కూర్చొని భక్తిని చాటారు.

## రామ ధ్వజాల పంపిణీ



ఇంటింటికి జెండాలను అందజేస్తున్న యువకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథనిలో శనివారం హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శనివారం హనుమాత్ యూత్ ఆధ్వర్యంలో రామ ధ్వజాలు(పతాకాలు) అందజేశారు. అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై రామ ధ్వజాలను ఏర్పాటు చేసుకోవడానికి అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రాము, రమేశ్, సురేష్, రమేశ్, భాస్కర్, గణేశ్, సతీశ్, నారాగౌడ్, శ్రీనివాస్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ క్రాస్ కంట్రీ జట్ల ఎంపికలు



తెయూ క్రాస్ కంట్రీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషులు, మహిళల క్రాస్ కంట్రీ (10 కిలోమీటర్లు) చాంపియన్‌షిప్– 2024 ఎంపిక పోటీలను శనివారం వర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించినట్లు డైరెక్టర్ జి.బాలకిషన్ తెలిపారు. పోటీల్లో తెయూ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి అనుబంధ డిగ్రీ కళాశాలల అథ్లెటిక్స్ సుమారు 40 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఎంపికైన జట్ల క్రీడాకారులు ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో మహారాష్ట్ర నాందేడ్ శ్రీరామానందతీర్థ మరట్వాడా వర్సిటీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, వివిధ కళాశాలల పీడీలు బాలమణి, అనిల్, ప్రవీణ్, రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ మల్లికార్జున్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు వీరే..**

**పురుషుల విభాగం** : కె.అనిల్, కె.నాగరాజు (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, కామారెడ్డి), డి.జ్ఞానేశ్వర్, జె.బందు నాయక్, ఎస్.వెంకుల్, కె.వినోద్ (ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కాలేజ్, నిజామాబాద్)

**మహిళల విభాగం** : బి.హరిత, ఎం.అంకిత (ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, కామారెడ్డి), జి.మౌనిక, జె.శ్రీ వర్ష (ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కాలేజ్, నిజామాబాద్), జి.రోజాశ్రీ, ఎస్.దీక్ష (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ(డబ్ల్యూ), నిజామాబాద్)

# చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### జిల్లా జడ్జి సునీత కుంచాల




మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పాల్గొన్న సీపీ కల్మేశ్వర్

ధర్పల్లి: చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సునీత కుంచాల పేర్కొన్నారు. మండలంలోని దుబ్బాకలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి తోపాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ హాజరై ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ.. చట్టాల గురించి అందరు తెలుసుకోవాలన్నారు. గ్రామస్తులు ఐకమత్యంతో ఉంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వీడీసీలు సాంఘిక బహిష్కరణకు పాల్పడితే చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కమిటీలు చట్టాలను అతిక్రమిస్తూ బహిష్కరణలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ తరహాలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సమంజసం కాదన్నారు. వీడీసీలు గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడితే ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు ఉండవని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సాంఘిక బహిష్కరణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, అదనపు డీసీపీ జయరాం, ఏసీపీ విజయ సారథి, ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో లక్ష్మణ్, సర్పంచ్ వెంకటేష్, ఎంపీపీ సారిక పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక




మంథని పాఠశాల విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ముప్కాల్ పాఠశాలలో..

పెర్కిట్(ఆర్మూర్)/బాల్కొండ: రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఆర్మూర్ మండలం మంథని, ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు లాస్య, అంకిత, ప్రశాంత్, అభినయ్‌కుమార్, ప్రణవ్ చైతన్య ఎంపికయ్యారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల వర్చువల్‌గా నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో మంథని పాఠశాల విద్యార్థులు 'సహజ పద్ధతిలో కూరగాయలు, పండ్ల నిలువ' చేసే ప్రాజెక్టును, ముప్కాల్ విద్యార్థులు 'కాంపిటీషన్ థింకింగ్', మల్టీ టాస్కింగ్ రోబోట్ అంశాలపై ప్రదర్శన ఇచ్చి తమ ప్రతిభచాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్యామలబాయి, గంగారాం, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. సైన్స్ టీచర్లు మల్లేశ్, కనకాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకు 866 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం జిల్లాలో నిర్వహించిన పరీక్షలో 866 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని 13 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2,563 మంది విద్యార్థులకు గాను 1,697 మంది హాజరుకాగా, 866 గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

### మోటార్ రేసింగ్‌లో వేల్పూర్‌వాసికి మూడోస్థానం



మూడోస్థానంలో నిలిచిన మన్విత్‌రెడ్డి

వేల్పూర్: చెన్నైలో శుక్రవారం నిర్వహించిన ఇండియన్ నేషనల్ మోటార్ సైకిల్ రేసింగ్ చాంపియన్ షిప్‌లో వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన క్యాతం మన్విత్‌రెడ్డి మూడో స్థానం పొందారు. మన్విత్‌రెడ్డి తండ్రి రమణారెడ్డి కుటుంబం చెన్నైలో స్థిరపడింది. మోటార్ సైకిల్ రేసింగ్‌లో మొత్తం ఆరు రౌండ్‌లలో పోటీలు నిర్వహించగా, ఫైనల్స్‌లో మన్విత్‌రెడ్డి మూడవస్థానం సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా మన్విత్ రెడ్డిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

## నేరస్తులకు శిక్షపడేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి: పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తమ విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం జిల్లా కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం ద్వారా పరిహారం పొందే విధానం, సాక్షులను విచారించే విధానం, నేరస్తులకు శిక్షపడడానికి సాక్షులను పొందుపర్చడంపై వివరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, రాజారెడ్డి, బంటు వసంత్, కావేటి శేషు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఖాందేశ్ శ్రీనివాస్, నిమ్మ దామోదర్ రెడ్డి, మహ్మద్ రహీముద్దీన్, డి.వీరయ్య, భూసారపు రాజేశ్ గౌడ్, అశోక్ శివరాంనాయక్, పారిక రాజేశ్వరి పాల్గొన్నారు.

### పలువురిపై కేసు నమోదు

భీమ్‌గల్: మండలంలోని బెజ్జోర గ్రామానికి చెందిన ఓ సంఘానికి చెందిన పలువురు సభ్యులపై కేసు నమోదైనట్లు ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. భూపంపిణీ విషయంలో తనకు అన్యాయం జరిగిందని, సంఘ సభ్యులందరూ కలిసి తీసుకున్న నిర్ణయాన్ని వినకపోవడంతో.. తమను ఏడాది కాలంగా బహిష్కరణ చేశారని బాధితురాలు భీమ్‌గల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి గ్రామంలో తమతో ఎవరూ మాట్లాడడం లేదని, చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు సంఘ సభ్యులు బోజ చిన్న నర్సయ్య, కోగూరు సుమన్, కోగూరు నరేష్, కోగూరు రవి, కోగూరు అశోక్, జాగిర్యాల రాజు, రావుట్ల బోజ రాజన్న, బోజ గంగాధర్ రెడ్డి, మూడెడ్ల నరేందర్, మూడెడ్ల ప్రేమ్ కుమార్‌లపై కేసు నమోదైనట్లు ఎస్సై తెలిపారు.

## వంద క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

### సిరిసిల్ల రోడ్డులో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు



డీసీఎంను స్వాధీనం చేసుకున్న అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారనే సమాచారం రావడంతో సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. వెంకటరమణ అనే వ్యాపారి దాదాపు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి ఓ డీసీఎంలో ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. సదరు వ్యాపారిపై గతంలోనూ పలు పీడీఎస్ అక్రమ రవాణా కేసులున్నాయి. డీసీఎంను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కిష్టయ్య మాట్లాడుతూ.. పీడీఎస్ బియ్యాన్ని నూకలుగా మార్చి సరఫరా చేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. దాదాపు 200 బస్తాల్లో నింపిన 100 క్వింటాళ్ల వరకు నూకలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.



## క్రైం కార్నర్

### తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

- రూ.8 లక్షల విలువైన సొత్తు అపహరణ



విచారణ జరుపుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లిన కుటుంబం ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్ కాలనీలో శనివారం వెలుగు చూసింది. కాలనీలో నివాసం ఉండే తన్నీరు శేఖర్ ఓ బీడీ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన కుటుంబంతో కలిసి ఈ నెల 18న తిరుపతికి వెళ్లాడు. శనివారం ఉదయం అతని ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. క్లూస్‌టీం బృందాన్ని పిలిపించి ఆధారాలు సేకరించారు. ఇంట్లో దాచి ఉంచిన రూ.3.50 లక్షల నగదు, మూడున్నర తులాల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు, రెండు లాప్‌టాప్‌లు చోరీకి గురైనట్లు శేఖర్ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### కాపర్ వైర్, ఆయిల్..



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ లక్ష్మణ్

నిజాంసాగర్: మండల కేంద్రంలోని బంజపల్లి శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేశారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్, లైన్‌మన్ సుదర్శన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

### వివాహిత అదృశ్యం

మోపాల్: ధర్పల్లి మండలంలోని రామడుగుకు చెందిన ప్రియాంక మోపాల్‌లోని తల్లిగారింటి నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్‌కు చెందిన ప్రియాంకతో ధర్పల్లిలోని రామడుగుకు చెందిన పిప్పెర పంపాల్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా ప్రియాంక తల్లిగారింటికి పిల్లలతో కలిసి వచ్చింది. ఈనెల 15న భర్త వచ్చి పిల్లలను తీసుకెళ్లాడు. అదేరోజు ప్రియాంక మోపాల్‌లో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. బంధువుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. ప్రియాంక తండ్రి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**కామారెడ్డి జిల్లా కేంద్రంలో యువతి..**

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆమె ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### ఆలయంలో దొంగతనం

సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్ పరిధిలో పోట్ల గుట్టపై గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం ఆలయంలో పూజలు చేయడానికి గ్రామస్తులు వెళ్లగా హుండీ ధ్వంసం చేసి ఉందని తెలిపారు. హుండీలో గల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఎస్సై రమేష్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

## నేడు ఆర్మీ లాంఛనాలతో రవిచంద్ర అంత్యక్రియలు



రవిచంద్ర (ఫైల్)

మాక్లూర్: రైలు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందిన మండలంలోని చిక్లి క్యాంప్‌కు చెందిన ఆర్మీ జవాన్ రవిచంద్ర అంత్యక్రియలు ఆదివారం ఆర్మీ లాంఛనాలతో జరుగనున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. వివరాలు.. రవిచంద్ర జమ్ము కాశ్మీర్‌లోని ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య శ్రీహర్ష సంక్రాంతి పండుగకు తన పుట్టింటికి ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు వెళ్లింది. సెలవుపై వచ్చిన రవిచంద్ర భార్య పిల్లలను తీసుకుని వచ్చేందుకై శుక్రవారం సికింద్రాబాద్‌లో కాకినాడ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి జారిపడి గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని శనివారం చిక్లి క్యాంప్‌కు తీసుకొచ్చారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి



శేఖర్(ఫైల్)

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన కుషపు శేఖర్(33) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి సెలవులు రావడంతో సదాశివనగర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను తీసుకువచ్చేందుకు శేఖర్ ఈనెల 11న చిక్లి నుంచి బైక్‌పై వెళ్లాడు. సదాశివనగర్ శివారులో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108లో కామారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య భూలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.